క్లుప్తంగా

ఆత్మీయ స్వాగతం



జి-20 సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఎయిర్‌పోర్టులో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులుగా 'గెస్ట్'లకు అవకాశమివ్వాలి

మద్దిలపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా చేపడుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకాల్లో ఇప్పటికే పదేళ్లగా పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు అవకాశం కల్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు శరత్ ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2014 నుంచి ఇప్పటి వరకూ 1074 మంది గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. 2012 నుంచి కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ నియామకాలు నిలిపివేశారన్నారు. అప్పటి నుంచి గెస్ట్ ఫ్యాకల్టీతోనే కాలం వెల్లదీశారన్నారు. ప్రస్తుతం 21 కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టులు భర్తీ చేయడానికి రీజనల్ జాయింట్ డైరెక్టర్ సన్నా హాలు చేస్తున్నారని, త్రిసభ్య కమిటీ ద్వారా నియామకమైన గెస్ట్ ఫ్యాకల్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. లేని పక్షంలో ఆ నియామకాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిలిపివేయాలని శరత్ డిమాండ్ చేశారు.

చురుగ్గా వార్డు కార్యాలయం పనులు



వార్డు కార్యాలయ పనుల కోసం సిద్ధం చేసిన ఇసుక, పిక్క

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: ఎట్టకేలకు వార్డు కార్యాలయం పనులు వేగవంతం అయ్యాయి. జీవీఎంసీ 35వ వార్డు జనతాబజార్ వద్ద కార్పొరేటర్ నిధులతో నిర్మాణం జరుగుతున్న వార్డు కార్యాలయం పనులు ఆగిపోయాయి. దీంతో సాక్షిలో నత్తనడకన వార్డు కార్యాలయం పనులు అనే శీర్షికతో వార్త వెలువడడంతో అధికారులు స్పందించి మంగళవారం నుంచి పనులు వేగవంతం చేశారు. నెల రోజుల వ్యవధిలో కార్యాలయం అప్పగించేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

'రామాయణ సంగ్రహము' గ్రంథావిష్కరణ

సీతంపేట: రచయిత ఆదూరి భీమారావు రచించిన రామాయణ సంగ్రహము గ్రంథావిష్కరణ సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ప్రసన్నభారతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమారావు 90 ఏళ్ల వయస్సులో గ్రంథాన్ని రాయడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ వాల్మీకి రామాయణం ఈ సృష్టి ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. శాశ్వత విలువలు రామాయణంలో ఉన్నాయని, వేదమే రామాయణంగా అవతరించిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త డి.వి.సూర్యారావు గ్రంథ సమీక్ష చేశారు. కేవలం కథ చెప్పడమే కాకుండా కథా ఘట్టాలను, పాత్రలను విమర్శ దృష్టితో పరిశీలించారని ప్రతి కాండ సారాన్ని చక్కని విశ్లేషణతో అందించారన్నారు.

కల్యాణ కాంతులు



మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలో అంబికాబాగ్ రామాలయం

- రాములోరి పెళ్లికి ఏర్పాట్లు పూర్తి
- అంబికాబాగ్ రామాలయానికి ఆధ్యాత్మిక శోభ
- మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ
- ఐదు వేల మంది భక్తులకు మహాప్రసాదం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ వర్గాలు



శ్రీరామనవమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో శిరీష తదితరులు

డాబాగార్డెన్స్: జగదభిరాముడు శ్రీరాముడు జానకిని పరిణయమాడే సుముహూర్తం సమీపించింది. అందుకు జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయం వేదిక అయింది. రాములోరి పెళ్లికి ఆలయ వర్గాలు.. ధర్మకర్తల మండలి ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఇప్పటికే కల్యాణంలో పాల్గొనే దంపతులకు ఆహ్వానం పలికారు. ప్రత్యేక దర్శనాలతో పాటు కల్యాణాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్న దృష్ట్యా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారు. ఆలయాన్ని మిరిమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో అలంకరించారు. సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 30న అత్యంత వైభవంగా న్విహించనున్న సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను మంగళవారం అంబికాబాగ్ రామాలయంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 5 గంటలకు స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు జరపనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని, అనంతరం 5 వేల మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ ఒకటిన శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణం చేయించుకోదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 0891- 2528645, 2566514 నంబర్లలో గాని.. లేదా అంబికాబాగ్ రామాలయం,



అంబికాబాగ్ రామాలయంలోని సీతారాములు, లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి

కనకమహాలక్ష్మి దేవస్థానంలో సంప్రదించవచ్చని చెప్పారు. కల్యాణం చేయించుకునే దంపతులకు స్వామి శేషవస్త్రం, ప్రసాదం అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సత్యరూపవాణి, ధనలత, అశోక్‌కుమార్, వెంకటరత్నం, అనురాధ, సతీష్, మారుతీప్రసాద్, సుబ్రహ్మణ్యం, సురేష్, ఆలయ కార్యనిర్వాహక ఇంజనీరు సీహెచ్‌వీ రమణ, రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకా పలుచోట్ల..

సీతారాముల పెళ్లికి నియోజకవర్గంలో గల రామాలయాలు సిద్ధమయ్యాయి. ఉగాది పండగ రోజున పెండ్లి రాట వేయడమే కాక పలు రామాలయాల్లో స్వామిని పెండ్లికొడుకును చేశారు. ఆలయాలు విద్యుత్ దీపాలంకరణలతో కళకళలాడుతున్నాయి. ప్రకాశరావుపేట రామాలయం, రామజోగిపేట శ్రీరామలింగేశ్వరాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, ప్రభుత్వ ఘోషాసుపత్రి వద్ద పురాతన సీతారామచంద్రస్వామి ఆలయం, చెంగల్రావుపేట రామాలయం, రెల్లివీధి రామాలయం, కోటవీధి రామాలయం, ఫిషింగ్ హార్బర్ రోడ్డులో గల రామాలయం, మట్టా వెంకటప్ప వీధి (పప్పుల వీధి)లో గల రామాలయం, వెలంపేట పెరికివీధి రామాలయం, గొల్లలపాలెం ఉమా రామలింగేశ్వరాలయం, దొండపర్తిలోని శ్రీరామ పంచాయతన ఆలయం, పాత నగరంలో గల పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.

రెండో రోజూ కొనసాగని వేలం పాట

జగదాంబ: జీవీఎంసీ జోన్-4 పరిధిలో వివిధ మార్కెట్లకు సంబంధించిన వేలం పాటలు రెండవ రోజు కూడా రద్దు చేశారు. ప్రతి సంవత్సరం జీవీఎంసీ జోన్-4 పరిధిలో గల పూర్ణామార్కెట్, రామకృష్ణరైతుబజార్, రెల్లివీధి మార్కెట్ల వేలం పాటలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంటుంది. అయితే ప్రతి సంవత్సరం నిర్వహించినట్టే ఈ ఏడాది కూడా పూర్ణామార్కెట్ ఆశీలు వేలం పాట నిర్వహించగా మొదటి, రెండవ రోజు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. జీవీఎంసీ గెజిట్ మార్చకుండా అధిక మొత్తంలో పాట పెట్టడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీనిపై జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను వివరణ కోరగా పాటదారులు జీవీఎంసీ నిర్ణయించిన వేలం పాట నగదు తగ్గించి పెట్టాలని కోరుతూ పాటలో పాల్గొనకపోవడంతో పాటను రెండవ రోజు కూడా రద్దు చేస్తున్నట్టు తెలిపారు.

టెక్‌ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ



కాలేజీ అధ్యాపకులతో టెక్‌ఫెస్ట్‌లో ప్రతిభా ధ్రువపత్రాలు అందుకున్న గైస్ విద్యార్థులు

మురళీనగర్: కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) విద్యార్థులు ప్రతిభ చాటారు. వీరు 8 గ్రూపులుగా తమ సృజనాత్మక పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించారు. రెండు గ్రూపులు పోస్టర్ ప్రదర్శన విభాగం, ఆరు గ్రూపులు పేపర్ ప్రజెంటేషన్ (పరిశోధనా పత్రం) విభాగాల్లో పాల్గొన్నారు. వీరిలో 5 గ్రూపులు బహుమతులు గెలుచుకున్నాయి. బి.ప్రణీత, సీహెచ్ మేఘన, జి.మెర్సీ, ఎల్ మురళీకృష్ణారావుల బృందం ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీకి సంబంధించి పోస్టర్ ప్రదర్శనలో మొదటి బహుమతి, గ్రీన్ కెమికల్స్ విభాగంలో బి.ప్రియాంక, అంజలి కుమారి, పి.జాహ్నవి బృందం పేపర్ ప్రజెంటేషన్‌లో మొదటి స్థానం, ఇదే విభాగంలో బి.హరి శంకర్, బి.నిత్యప్రకాష్, ఎంవీ నరేష్ వర్మ బృందం ద్వితీయ బహుమతి, కార్బన్ సీక్వెస్ట్రేషన్ విభాగంలో వై.హర్ష, పి.లక్ష్మణ్‌చరణ్, కె.దుర్గా ప్రసాద్‌ల బృందం పేపర్ ప్రజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి, సబ్-సీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో జయంతి శ్రావణ శృతి, ఎల్.తేజసాయి, వి.జ్ఞానేశ్వర్ బృందం పేపర్ ప్రజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా కాలేజీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర సిబ్బంది అభినందించారు.

తీరంలో జి-20 దేశాల జెండాల రెపరెపలు



తీరంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాలు

బీచ్ రోడ్డు: జి-20 సదస్సు నగరంలో జరుగుతున్న నేపథ్యంలో ఆయా దేశాల జాతీయ జెండాలు సాగర తీరంలో రెపరెపలాడుతున్నాయి. అలాగే ఆయా దేశాల వివరాలతో కూడిన సైన్ బోర్డులను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. బీచ్‌కు వస్తున్న సందర్శకులు ఆసక్తిగా వాటిని తిలకిస్తున్నారు.

నాటక రంగంపై అవగాహన అవసరం



రంగస్థల కళాకారుడిని సత్కరిస్తున్న పైడా కృష్ణప్రసాద్, ఆచార్య బాలమోహన్‌దాస్

డాబాగార్డెన్స్: నాటక రంగంపై అవగాహన అవసరమని, విద్యార్థులకు ఈ రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని ప్రముఖ సంగీత నవ అవధానకర్త డాక్టర్ మీగడ రామలింగస్వామి అభిప్రాయపడ్డారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలో గల పైడా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి. బాలమోహన్‌దాస్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మీగడ మాట్లాడుతూ సరైన అవగాహన లేక నాటక రంగం మసకబారిపోతుందన్నారు. మాతృభాష అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే తన ధ్యేయమన్నారు. పద్యాలు, అవధానాలు, శ్లోకాలు, నాటకాల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. నాటక కళాకారులు, నాటక అభివృద్ధికి కృషి చేస్తున్న వారంతా ధన్యులని కొనియాడారు. పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నాటక రంగం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ చదువు, క్రమశిక్షణ, నాటకాలు ఉన్నత స్థానాలకు విద్యార్థులు వెళ్లేందుకు దోహదపడతాయన్నారు. మాతృభాష పరిరక్షణకు ఎందరో మహానుభావులు కృషి చేస్తున్నారన్నారు. సినిమాల్లో రాణిస్తున్న ఎందరో ప్రముఖులు నాటకాల ద్వారానే ఆ స్థాయికి చేరుకున్నారని అన్నారు. అనంతరం మీగడ మల్లికార్జునస్వామి, బోణం గురుమూర్తులకు ఆత్మీయ రంగస్థల పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో నాటకరంగ ప్రముఖులు, అవధానకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇప్పించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు దుర్గమాంబ సమాజంలో నివాసం ఉంటున్న నివాసదారులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరుతూ మహారాణిపేట తహసీల్దార్ ఆనందబాబుకు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ 122 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న దుర్గమాంబ సమాజం నివాసదారులు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాని వలన బ్యాంక్ లోన్లు ఇతర సౌకార్యాలు పొందలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఓట్లు వేయించుకున్నాయి కాని పట్టాలు ఇవ్వలేదన్నారు. కాని వైఎస్సార్‌సీపీ హయాంలో అందరూ సొంత ఇళ్లు కలిగి ఉండాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు నివాసదారులకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరామన్నారు. దీనిపై స్పందించిన ఆనంద్‌బాబు పట్టాల విషయం ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న వర ప్రసాదరావు. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డేవిడ్‌రాజ్ తదితరులు

మహారాణిపేట : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రెవెన్యూ గెస్టుహౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల హోం మంత్రి తానేటి వనిత సహకారంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరించినట్లు తెలిపారు. 2009 ఆగస్టు 2వ తేదీన స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి దళిత క్రైస్తవ తీర్మానం చేసి ఢిల్లీకి పంపించారన్నారు. సోము వీర్రాజు వ్యాఖ్యలు భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్టు ఉందన్నారు. క్రైస్తవ దళితులు బీజేపీకి వ్యతిరేకం కాదని, సోము వీర్రాజు తక్షణమే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో దళిత నాయకుడు మధుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్. డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక రథసారథి కొసనా



కొసనా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

సీతంపేట: అరున్నర దశాబ్దాలు కళారంగానికి సేవలందించిన కొసనా తృతీయ వర్ధంతి సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొని కొసనా చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించిన సాంస్కృతిక నిఘంటువు కొసనా అని కొనియాడారు. కళావేదిక ట్రస్టు అధ్యక్షులు నండూరి రామకృష్ణ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నాకటం, చిత్రలేఖనం వంటి అంశాలలో నిరంతరం సేవలందించిన మహోన్నత వ్యక్తి కొసనా అని ప్రశంసించారు. కొసనా తనయుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ తన తండ్రి సేవలను గుర్తుపెట్టుకుని క్రమం తప్పకుండా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆధ్యాత్మికవేత్తలు ఎస్.ఫణిస్వామి, ఎం.వి.రాజశేఖర్, కొసనా కల్చరల్ అకాడమి అధ్యక్షురాలు సుసర్ల శేషమణి, స్వరరంజని అధ్యక్షురాలు లతారాములు, కళారంగ ప్రముఖులు మేడా మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, పి.శ్యామ్‌సుందర్, మెలోడి సత్యనారాయణ, ఎంవీఆర్ నాగేశ్వరరావు, ఎంటీఆర్ త్రినాథ్, లోకేష్, బంగార్రాజు, బి.సత్య మాధవి పాల్గొని నివాళులు అర్పించారు.

ప్రజాదర్బార్‌కు చక్కటి స్పందన



శ్రీరామనవమి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్‌కుమార్ తదితరులు



39వ వార్డులో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని పరదేశమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వార్డు ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందించారు. ఈ సందర్భంగా శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం కరపత్రాన్ని ఎమ్మెల్యే తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, అజయ్‌రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో..

డాబాగార్డెన్స్: మత్స్యకారుల సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు మత్స్యకారుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. రూ.150 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌లో నిర్మాణంలో మత్స్యకార అసోసియేషన్ సభ్యులు కోరిన మేరకు చేపట్టబోయే పనుల వివరాలు తెలియజేయాలని పోర్టు చైర్మన్‌ను కోరారు. ఈ సందర్భంలోనే ఫింగర్ జెట్టీలు త్వరితగతిన చేపట్టాలని పోర్ట్ చైర్మన్‌ను ఎమ్మెల్యే కోరారు. అలాగే ఎండు చేపలు ఎండబెట్టుకుని వ్యాపారం చేసుకునే వారికి వేరే ప్రాంతంలో స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు. 2019 జూన్ నుంచి నవంబర్ వరకు రూ.2,07,57,308 మంజూరు చేసి, మత్స్యకారులను ఆదుకోవాలని కోరగా ప్రిన్సిపాల్ సెక్రటరీ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. అలాగే పెరుగుతున్న ఆయిల్ ధరల ప్రకారం ఆయిల్ సబ్సిడీ పెంచాలని మత్స్యకార అసోసియేషన్ కోరిన వెంటనే ఫిషరీస్ కమిషనర్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. మెట్రో సిటీలు బెంగళూరు, ముంబై తరహాలో హోల్‌సేల్ చేపల మార్కెట్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మత్స్యకారులు ఎమ్మెల్యేను కోరారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలపై వెంటనే చర్యలు చేపట్టాలని ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ విజయ్, ఏడీ కిరణ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఫిషరీస్ అసోసియేషన్ సభ్యులు వీరన్న, బర్రి కొండబాబు, పీసీ అప్పారావు, బుజ్జి, నర్సింగ్, మున్నం బాలాజీ, రాము, పార్టీ నాయకుడు సంకాబక్తుల సన్యాసిరావు, మారోజు శ్రీనివాస్, కోన శంకర్, తాడి రవితేజ తదితరులు పాల్గొన్నారు. అలాగే 39వ వార్డులో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వైఎస్సార్ సీపీ కార్యకర్త కొల్లి రామకృష్ణ కంటి ఆపరేషన్ కోసం రూ.2 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పీతల వాసు, సనపల రవీంద్రభరత్, తిత్తి కృష్ణ, కోరాడ సురేష్, కడియం ప్రసాద్, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

జీవో 21 రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఆటో రిక్షా కార్మికులు

అల్లిపురం: కేంద్ర ప్రభుత్వం జీవో నంబర్ 21 తీసుకువచ్చి మోటార్ కార్మికులకు ఉరి తాడు బిగించిందని, తక్షణమే దానిని రద్దు చేయాలని విశాఖపట్నం ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. సంఘం జనరల్ బాడీ సమావేశం సోమవారం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ఆటోలు, ఆటో డ్రైవర్లు రెండు నెలల పాటు ఇంటికే పరిమితమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించక ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కేసులను వెంటనే ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ కాసుబాబు, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.మన్మథరావు, సీహెచ్ సాయి అప్పలరాజు, శ్రీను, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

30న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 30న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే దంపతులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా యువత పోరాడాలి

అల్లిపురం: దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత యువత, విద్యార్థులదేనని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ అన్నారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా 'విద్యార్థులు ఆత్మహత్యలు-వ్యవస్థాపక కారణాలు-మన కర్తవ్యాలు' అనే అంశంపై వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ ఒక మనిషిని వేరొక మనిషి, ఒక జాతిని వేరొక జాతి, ఒక దేశాన్ని వేరొక దేశం దోచుకోని సమ సమాజం రావాలని కోరుకున్నారన్నారు. కాని నేటికీ మనదేశంలో విదేశీ బహుళ జాతి కంపెనీల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ దేశంలో వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల గురించి ప్రస్తావించి నేటి చదువు విద్యార్థులకు వారి సమస్యలు పరిష్కరించుకుని ఆత్మస్థైర్యాన్ని ఎందుకు ఇవ్వలేకపోతోందన్నారు. ప్రస్తుత విద్యా విధానాన్ని ఎండగట్టారు. ఈ ఆత్యహత్యలన్నీ వ్యవస్థ చేస్తున్న హత్యలేనని, వాటికి గల మూల కారణాలపై భగత్‌సింగ్ వంటి పోరాట యోధుల స్ఫూర్తితో పోరాడాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్, విశాఖ జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.లలిత, జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ



క్వీన్‌మేరీ స్కూల్లో రాగిజావ పంపిణీని పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం ధర్మేంద్రరెడ్డి

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య (ఇంటర్వెల్ సమయంలో) విద్యార్థులకు రాగిజావ ఇచ్చేలా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. జిల్లాలోని 587 పాఠశాలల్లో అమలు చేస్తుండగా, 87,861 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. రోజుకో రుచికరమైన వంటకంతో జగనన్న గోరుముద్ద పథకం అందిస్తూనే, విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేకంగా రాగిజావ ఇస్తున్నారు. బెల్లం పొడి కలిపిన రాగిజావ ఎంతో రుచికరంగా ఉండటంతో దీనిని తీసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పరిశుభ్రమైన వాతావరణంలో రాగిజావ తయారు చేసేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

గ్రూప్-1 పరీక్ష వాయిదాపై హర్షం

ఎంవీపీ కాలనీ: గ్రూప్-1 ప్రధాన పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయడంపై నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వానికి, వాయిదా దిశగా కృషి చేసిన మంత్రి బొత్స సత్యనారాయణకు ఆయన ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. వాయిదాతో శిక్షణకు అభ్యర్థులకు మరికొంత సమయం లభించిందన్నారు. ఎస్సై, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షల్లో ప్రశ్నపత్నంలో లోపాల నేపథ్యంలో సచివాలయ పరీక్షల తరహాలో 15 గ్రేస్ మార్కులు కలపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ వయోపరిమితి పెంచి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెగా డీఎస్సీని విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు.